భారత్-చైనా సరిహద్దులో 108 కిలోల బంగారం పట్టివేత

లేహ్, జూలై 10: భారత్-చైనా సరిహద్దుకు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 108 కిలోల బంగారాన్ని ఐటీబీపీ (ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్) అధికారులు సీజ్ చేశారు. మంగళవారం తూర్పు లఢక్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా ఒక్కోటి కిలో బరువున్న 108 బంగారు కడ్డీలు పట్టుబడినట్టు ఐటీబీపీ అధికారి ఒకరు బుధవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు.

13 అసెంబ్లీ స్థానాలకు ముగిసిన బైపోల్స్

న్యూఢిల్లీ: ఏడు రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు బుధవారం ఉప ఎన్నికల పోలింగ్ జరిగింది. ఉత్తరాఖండ్, బీహార్, పశ్చిమ బెంగాల్‌లో కొన్ని చోట్ల చెదురుమదురు హింసాత్మక ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఈసీ తెలిపింది. తమిళనాడులోని విక్రవాండి స్థానంలో అత్యధికంగా 82.48 శాతం, ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ స్థానంలో అత్యల్పంగా 49.80 శాతం ఓటింగ్ నమోదైంది.

పాల వ్యానును ఢీకొట్టిన బస్సు.. 18 మంది మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం ఘోర దుర్ఘటన జరిగింది. బెహతా ముర్ఘూ వర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోజికోట్ గ్రామం సమీపంలో ఓ పాల వ్యానును డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు ఢీకొట్టింది. బుధవారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో 18 మంది మృతి చెందగా, 19 మంది గాయపడినట్లు అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ ఎస్‌బీ షిరద్కర్ చెప్పారు.

పెగాసస్‌తో నా ఫోన్ హ్యాక్ చేశారు: ముఫ్తీ కుమార్తె

శ్రీనగర్: పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ కుమార్తె ఇల్తిజా ముఫ్తీ బుధవారం సంచలన ఆరోపణ చేశారు. తన ఫోన్‌ను పెగాసస్ స్పైవేర్‌తో హ్యాక్ చేశారని చెప్పారు. దీని గురించి తనకు యాపిల్ అలర్ట్ వచ్చిందన్నారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించడం కోసం కేంద్రం పెగాసస్‌ను సేకరించిందని ఆరోపించారు.

ఐఐటీయన్లకూ అత్తెసరు ప్యాకేజీనే!

- ఐఐటీల్లోనూ ప్లేస్‌మెంట్ల కరువు
- తక్కువ జీతంతోనే రిక్రూట్‌మెంట్లు
- 15 లక్షల ప్యాకేజీ రావడమే గొప్ప
- దేశీయ టాప్ కాలేజీల్లోనూ ఇలాగే
- డెలాయిట్, టీమ్‌లీజ్ సర్వేల్లో వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): దేశంలోనే ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలైన ఐఐటీల్లోనూ కొలువుల సంక్షోభం, వేతనాల కోత కొనసాగుతున్నది. ఒకప్పుడు ఏడాదికి సగటున రూ. 25 లక్షల నుంచి రూ. 30 లక్షల ప్యాకేజీతో ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకొన్న ఐఐటీయన్లకు ఇప్పుడు వేతనం రూ. 15 లక్షలు దాటడమే కష్టంగా మారింది. ఈ మేరకు డెలాయిట్, టీమ్‌లీజ్ సంస్థలు వేర్వేరుగా చేసిన సర్వేల్లో బయటపడింది. పురాతన ఏడు ఐఐటీల్లో కిందటేడాది సగటు వేతన ప్యాకేజీ రూ. 18 లక్షలు-రూ. 20 లక్షలుగా ఉంటే, ప్రస్తుతం ఇది రూ. 15 లక్షలకు తగ్గిందని వెల్లడైంది. కొత్త ఐఐటీల్లో ఇది రూ. 12 లక్షలకే పరిమితమైనట్టు తేలింది. దేశంలో టాప్ ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ వేతనాలు ఆశాజనకంగా లేవని నివేదికలు తెలిపాయి.

ఉద్యోగాలూ కష్టమే

ఐఐటీల్లో చదివినవారిలో దాదాపు 40 శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు లభించడం లేదని ఉద్యోగాల కల్పన సేవలు అందించే ఆఫీస్ ఆఫ్ కెరీర్ సర్వీసెస్(ఓసీఎస్) తాజా నివేదికలో వెల్లడించింది. ఉద్యోగాలు వచ్చినవారిలోనూ చాలామందికి రూ.10 లక్షల లోపే వార్షిక వేతనం ఉన్నట్టు వివరించింది. దాదాపు 1,800 మంది ఐఐటీ-ఢిల్లీ విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకుంటే 1,083 మందికే కొలువులు లభించినట్టు నివేదిక గుర్తు చేసింది. అంటే దాదాపు 40 శాతం మందికి ఉద్యోగాలు దొరకలేదని తెలిపింది. గత ఐదేండ్లలో ఐఐటీలో చదువులు పూర్తిచేసిన దాదాపు 22 శాతం మంది విద్యార్థులకు ఇప్పటికీ ఉద్యోగాలు దొరకలేదని ఓ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైంది.

కారణాలు ఇవే

ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమంద గమనం, పశ్చిమ దేశాల్లో నెలకొన్న ఐటీ సంక్షోభం, ఐటీని కాదని తయారీ, ఎలక్ట్రికల్ వెహికిల్ (ఈవీ) తదితర రంగాల్లో పెట్టుబడులు పోటెత్తడం.. వెరసి ఐటీ ఉద్యోగాల్లో కోతలతో పాటు ప్యాకేజీల్లో తగ్గుదల నమోదవుతున్నట్టు టీమ్‌లీజ్ సీఈవో రమేశ్ అల్లూరీ రెడ్డి తెలిపారు.

11.3 లక్షల కోట్ల నష్టం

- 1.6 కోట్ల ఉద్యోగాల గల్లంతు
- మూతబడ్డ 63 లక్షల సంస్థలు
- దేశంలో అసంఘటిత రంగంపై పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, కొవిడ్ దెబ్బ
- ఇండియా రేటింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న అసంఘటిత రంగం 2016 నుంచి దారుణంగా దెబ్బతిన్నదని ఇండియా రేటింగ్ అండ్ రిసెర్చ్ సంస్థ చేసిన ఒక అధ్యయనంలో వెల్లడైంది. కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేయడంతో ఈ రంగంలో పతనం మొదలయ్యిందని, జీఎస్టీ అమలుతో ఇది మరింత తీవ్రమైందని పేర్కొన్నది. కొవిడ్ మహమ్మారి ఈ రంగాన్ని కోలుకోలేని దెబ్బ తీసిందని తెలిపింది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.11.3 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నది. అసంఘటిత రంగంలో 63 లక్షల సంస్థలు మూతబడ్డాయని, ఫలితంగా 1.6 కోట్ల మంది ఉద్యోగాలు పోయాయని వెల్లడించింది.

పెద్ద నోట్ల రద్దుతో మొదలు

పన్నుల పరిధిలో ఉండని వీధి వ్యాపారాలు వంటి వాటిని అసంఘటిత రంగంగా చూస్తారు. దేశ గ్రాస్ వాల్యూ యాడెడ్(జీవీఏ)లో దీని వాటా దాదాపు 44 శాతంగా ఉంటుంది. అయితే, 2016లో పెద్ద నోట్ల రద్దు నుంచి ఈ రంగంలో ఒడిదొడుకులు మొదలయ్యాయి. జీఎస్టీ అమలు చేయడం, కొవిడ్ ప్రభావంతో ఈ రంగం వరుస దెబ్బలు తిన్నది. ఫలితంగా 2015-16 నుంచి 2022-23 వరకు దాదాపు 63 లక్షల చిరు వ్యాపారాలు మూతబడి 1.6 కోట్ల ఉద్యోగాలు పోయాయని నివేదిక తెలిపింది.

గాలి నుంచి వెన్న

- సీఓ2, నీటి సాయంతో తయారీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని సావోర్ అనే స్టార్టప్ కంపెనీ గాలి నుంచి వెన్నను తయారు చేసింది. థర్మోకెమికల్ పద్ధతిలో గాలిలోని కార్బన్‌డైఆక్సైడ్ (సీఓ2) నుంచి కార్బన్ అణువులను, నీటిఆవిరి నుంచి హైడ్రోజన్ అణువులను సేకరించి వాటిని ఒక దగ్గరకు చేర్చి ఆక్సీకరణం చెందించి వెన్నను ఉత్పత్తి చేసింది. ఈ ప్రక్రియలో జంతువులు, మొక్కల కొవ్వు పదార్థాలను ఏ మాత్రం వాడలేదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌కు కారణమయ్యే సీఓ2తో వెన్నను తయారు చేయడం ఒకవిధంగా పర్యావరణానికి మేలు చేయడమేనని పేర్కొన్నారు. ఈ వెన్న రుచి బాగున్నదంటూ ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్ ఓ వీడియోలో పేర్కొనడం గమనార్హం.

8 నెలల్లో 9 మందితో పెండ్లి!

- కిలాడి పెండ్లి కూతురు అరెస్ట్

ముంబై, జూలై 10(నమస్తే తెలంగాణ): ఎనిమిది నెలల్లో 9 మందిని పెండ్లి చేసుకుని లక్షలాది రూపాయలు దోచుకొని పారిపోయిన ఒక కిలాడి పెళ్లి కూతురు సహా 12 మంది ముఠాను అహ్మదానగర్ జిల్లా శ్రీగోందా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సిమ్రాన్ అనే యువతి హైదరాబాద్, గుజరాత్, మధ్యప్రదేశ్, ముంబైలో అమాయక యువకులను పెళ్లి చేసుకుని లక్షలాది రూపాయలు దండుకొని పారిపోయేదని పోలీసుల విచారణలో తేలింది. తాజాగా మహారాష్ట్రలో నితిన్ ఉల్గే అనే యువకుడిని సిమ్రాన్ పెండ్లి చేసుకుని పరారవ్వడానికి ప్రయత్నించగా పోలీసులు పట్టుకున్నారు.

భగవద్గీతపై ప్రమాణం చేసిన బ్రిటన్ ఎంపీ

లండన్: భారతీయ మూలాలుగల శివానీ రాజా (29) బ్రిటన్ పార్లమెంటులో భగవద్గీతపై ప్రమాణం చేశారు. ఆమె తాజా ఎన్నికల్లో లెస్టర్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థిని అయిన ఆమె లేబర్ పార్టీ అభ్యర్థి రాజేశ్ అగర్వాల్‌పై గెలుపొందారు. ఆయన కూడా భారతీయ మూలాలు గలవారే.

ఆర్నెల్లలో 557 మంది రైతుల ఆత్మహత్య

మహారాష్ట్ర అమరావతి డివిజన్‌లో అన్నదాతల దయనీయ పరిస్థితి

అమరావతి: బీజేపీ సంకీర్ణ ప్రభుత్వ పాలనలోని మహారాష్ట్రలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రాష్ట్రంలోని అమరావతి డివిజన్ ఐదు జిల్లాల్లో ఈ ఏడాది జనవరి నుంచి జూన్ మధ్య 557 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడినట్టు అధికారిక నివేదిక వెల్లడించింది. అమరావతి జిల్లాలో అత్యధికంగా 170 మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకోగా.. యావత్మల్‌లో 150, బుల్దానాలో 111, అకోలాలో 92, వాశిమ్‌లో 34 మంది ఉసురు తీసుకొన్నారని అమరావతి డివిజనల్ కమిషనరేట్ రూపొందించిన నివేదిక పేర్కొన్నది. వీరిలో కేవలం 53 మంది రైతు కుటుంబాలకు మాత్రమే ప్రభుత్వం నుంచి పరిహారం అందగా.. ఇంకా 284 మంది రైతుల ఆత్మహత్యలపై విచారణ పెండింగ్‌లో ఉన్నదని తెలిపింది.

ఫిలిప్పీన్స్ సమీపంలో చైనా 'రాకాసి' యుద్ధనౌక

రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు

న్యూఢిల్లీ, జూలై 10: చైనా, ఫిలిప్పీన్స్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. గత నెల వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలోని సెకండ్ థామస్ షోల్ సమీపంలో చైనా, ఫిలిప్పీన్స్ జవాన్ల మధ్య ఘర్షణ నేపథ్యంలో దక్షిణ చైనా సముద్రంలోని ఫిలిప్పీన్స్ ప్రత్యేక ఆర్థిక జోన్(ఈఈజెడ్) సమీపంలో చైనా తన 'రాకాసి యుద్ధనౌక'ను మోహరించడం ప్రాధాన్యం సంతరించుకొన్నది. ఈ నౌక మోహరింపు ఈ నెల 6న జరిగింది. అది మనీలాకు 200 నాటికన్ మైళ్ల దూరంలోని ఈఈజెడ్‌లోకి ప్రవేశించిన నేపథ్యంలో ఫిలిప్పీన్స్ కోస్ట్ గార్డు(పీసీజీ) కూడా అప్రమత్తమైంది. 165 మీటర్ల పొడవు, సాధారణ పెట్రోలింగ్ నౌకల కంటే 3-4 రెట్ల అతిపెద్ద పరిణామంలో ఉండే సీసీజీ-5901అనే అసాధారణమైన కోస్ట్ గార్డ్ నౌకను చైనా స్పార్ట్లీ ద్వీపం సమీపంలోని సబీనా షోల్ సమీపంలో మోహరించిందని అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్ఎన్ పేర్కొన్నది. ఈ నౌక పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఏరియాతోపాటు దాని పరిమాణం కూడా అసాధారణంగా ఉన్నది. పొరుగు దేశమైన ఫిలిప్పీన్స్‌ను బెదిరించేందుకు చైనా ప్రయత్నిస్తున్నదని పలువురు భావిస్తున్నారు. దక్షిణ చైనా సముద్రంలో యుద్ధానికి కూడా చైనా కాలు దువ్వుతున్నదని మరి కొందరు విశ్లేషిస్తున్నారు. కాగా, తాజా పరిణామంపై ఫిలిప్పీన్స్ కోస్ట్ గార్డు అధికార ప్రతినిధి జే తరియెలా మాట్లాడుతూ తమ దేశ ఈఈజెడ్‌లో ఉండటంపై చైనా నౌకకు హెచ్చరికలు చేశామని తెలిపారు.

అస్సాంలో 'హ్యారీపోటర్ పాము'!

న్యూఢిల్లీ, జూలై 10: హ్యారీ పోటర్ ఫాంటసీ కథల్లో చెప్పుకునే 'సలాజర్ పిట్ వైపర్' నిజ జీవితంలోకి వచ్చింది. చాలా ఏండ్ల తర్వాత మళ్లీ అది అస్సాంలోని 'కజిరంగ జాతీయ పార్క్'లో కనపడింది. ఇందుకు సంబంధించి అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ ఆసక్తికర ట్వీట్ చేశారు. 'చూశారా..! ఇది హ్యారీ పోటర్ రియల్ లైఫ్ స్నేక్. ఆకుపచ్చ రంగులో సూపర్ కూల్‌గా ఉంది. ఎరుపు, ఆరెంజ్ రంగులతో ప్రకృతి చేసిన అద్భుతం ఇది' అని ఎక్స్‌లో సందేశాన్ని పోస్ట్ చేశారు. 'హ్యారీ పోటర్' ఫాంటసీ కథల్లో కనిపించే పాము చాలా పాపులర్. ఇలాంటి పాము.. 2019లో అరుణాచల్ ప్రదేశ్‌లో మొదటిసారి కనపడగా, ఆ పాముకు 'హ్యారీ పోటర్' నవల్లోని విలన్ పాత్ర 'సలాజర్ స్లిథరిన్' పేరు పెట్టారు.

యాక్సిడెంట్ తర్వాత 40 సార్లు గర్ల్‌ఫ్రెండ్‌కు ఫోన్

ముంబై, జూలై 10: మద్యం మత్తులో బీఎండబ్ల్యూను నడిపి ఒక మహిళను ఢీకొని ఆమె మృతికి కారకుడైన శివసేన నేత కుమారుడు మిహిర్ షాకు కోర్టు ఈనెల 16 వరకు పోలీస్ కస్టడీ విధించింది. ఆదివారం తెల్లవారుజామున వర్లీ ప్రాంతంలో యాక్సిడెంట్ చేసిన తర్వాత మిహిర్ షా 40 సార్లు తన ప్రియురాలికి ఫోన్ చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ఇప్పుడు ఆమెను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించే అవకాశం ఉంది. ప్రమాదంలో మహిళ మరణించిన తర్వాత ఆటోలో గోరేగావ్‌లోని ప్రియురాలి ఇంటికి వెళ్లిన మిహిర్ అక్కడ రెండు గంటలు ఉన్నాడు. ఆమె అతని సోదరికి ఫోన్ చేసి చెప్పడంతో ఆమె వచ్చి షాను బోరివలిలోని తన ఇంటికి తీసుకుపోయింది. అక్కడి నుంచి 70 కి.మీ. దూరంలోని షాహ్‌పూర్‌లోని ఒక రిసార్టుకు పరారయ్యారు. అయితే ఫోన్ ద్వారా అతని లొకేషన్‌ను కనిపెట్టిన పోలీసులు షాను అరెస్ట్ చేశారు.

వాణిజ్య

హైదరాబాద్‌లో.. లీవర్

హైదరాబాద్, జూలై 10: బెంగళూరుకు చెందిన ఈవీ బైకుల తయారీ సంస్థ రీవర్..హైదరాబాద్‌లో తన తొలి స్టోర్‌ను బుధవారం ప్రారంభించింది. వెయ్యి చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో కంపెనీకి చెందిన అన్ని రకాల వాహనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. వ్యాపార విస్తరణలో భాగంగా తెలంగాణలో ప్రవేశించినట్లు, రాష్ట్రంలో ఈవీలకు డిమాండ్ అధికంగా ఉంటుందన్న అంచనాతో ఇక్కడే మరిన్ని స్టోర్లను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నదని కంపెనీ కో-ఫౌండర్, సీఈవో అరవింద్ మణి తెలిపారు.

ఖరీదెక్కిన టర్మ్ ఇన్సూరెన్స్

- 10 శాతం వరకు ప్రీమియం ధరల్ని పెంచిన ప్రముఖ సంస్థలు
- వృద్ధుల దగ్గర్నుంచి అన్ని వర్గాలపై పెరిగిన భారం
- పెంపు బాటలో మరికొన్ని ప్రైవేట్ కంపెనీలు
- ప్రభుత్వ సంస్థలు మాత్రం దూరం

న్యూఢిల్లీ, జూలై 10: టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం ధరలు పెరిగాయి. భారీ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్, టాటా ఏఐఏలు కనిష్ఠంగా 1 శాతం, గరిష్ఠంగా 10 శాతం వరకు పెంచినట్టు ప్రకటించాయి. భారతీయ మూడో అతిపెద్ద జీవిత బీమా సంస్థ, రెండో అతిపెద్ద ప్రైవేట్ రంగ బీమా సంస్థ అయిన హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్.. తమ టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియం ధరలను దాదాపు 10 శాతం మేర పెంచినట్టు చెప్తున్నారు. అయితే 60 ఏండ్లకుపైబడినవారికే ఈ పెంపు వర్తిస్తుందని అంటున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ మొత్తం వ్యక్తిగత వార్షిక ప్రీమియంల విలువలో 5 శాతానికి సమానంగా దాని టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంల వాటా ఉన్నది.

మిగతా వాటిలో..

మరో ప్రైవేట్ రంగ బీమా కంపెనీ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కూడా తమ టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంల ధరలను 1 నుంచి 6 శాతం మేర పెంచింది. ఆయా వయసులనుబట్టి ఈ పెంపు లున్నాయి. మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వ్యక్తిగత వార్షిక బీమా ప్రీమియంలలో టర్మ్ ఇన్సూరెన్స్ వాటా 9 శాతం. ఇక బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ టర్మ్ పాలసీల రేట్లు 1 నుంచి 5 శాతం మేరకు పెరిగాయి. టాటా ఏఐఏ టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలూ 3 శాతం నుంచి 10 శాతం వరకు పెరిగాయి. బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ వ్యక్తిగత వార్షిక ప్రీమియంలలో టర్మ్ ఇన్సూరెన్స్ వాటా 6 శాతంగా ఉన్నది.

ఇదే బాటలో..

మరికొన్ని కంపెనీలూ తమ బీమా ప్రీమియంల రేట్లను పెంచాలని చూస్తున్నాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ టర్మ్ పాలసీల ధరలు 3 శాతం నుంచి 5 శాతం వరకు పెరగవచ్చన్న సంకేతాలున్నాయి. అయితే ప్రభుత్వ రంగ బీమా సంస్థలు మాత్రం పెంపునకు నో అంటున్నాయి. ఎల్‌ఐసీ, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లు ఇప్పటికైతే పెంచబోవడం లేదంటున్నాయి. కాగా, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, జనాభా, స్థిరంగా పాగాతున్న రీఇన్సూరెన్స్ ఖర్చుల నేపథ్యంలోనే ప్రీమియంల ధరల్ని సవరించాల్సి వస్తున్నదని బీమా ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో టర్మ్ ఇన్సూరెన్స్‌లకు పెరుగుతున్న ఆదరణ కూడా రేట్ల పెంపునకు కారణమేనన్న అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి.

2023-24కుగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రూ.2,514.22 కోట్ల విలువైన డివిడెండ్ చెక్కును అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఎండీ దేవదత్త చంద్

మెడ్‌ట్రానిక్ 500 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్‌లో అతిపెద్ద గ్లోబల్ ఐటీ సెంటర్ ప్రారంభించిన సంస్థ

హైదరాబాద్‌లో మెడ్‌ట్రానిక్ గ్లోబల్ ఐటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి డీ శ్రీధర్ బాబు తదితరులు

హైదరాబాద్, జూలై 10: అమెరికాకు చెందిన మెడికల్ టెక్నాలజీ దిగ్గజాల్లో ఒకటైన మెడ్‌ట్రానిక్.. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మెడ్‌ట్రానిక్ ఇంజినీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌లోనే గ్లోబల్ ఐటీ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సంయుక్తంగా ప్రారంభించారు. అమెరికా బయట అతిపెద్ద గ్లోబల్ ఐటీ సెంటర్ ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రమ్మీ కుమార్ మాట్లాడుతూ..వచ్చే మూడు నుంచి ఐదేండ్లకాలంలో ఈ గ్లోబల్ ఐటీ సెంటర్‌ను మరింత విస్తరించడానికి రూ.500 కోట్లు(60 మిలియన్ డాలర్లు) పెట్టుబడిగా పెట్టబోతున్నట్లు ప్రకటించారు. తద్వారా 300 మందికి కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నా. క్లౌడ్ ఇంజినీరింగ్, డాటా ప్లాట్‌ఫాం, డిజిటల్ హెల్త్ అప్లికేషన్స్, హైపర్ ఆటోమేషన్, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి విభాగాలపై ప్రత్యేక దృష్టి సారించడానికి ఈ సెంటర్‌ను నెలకొల్పినట్లు చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో క్లయింట్లకు ఇక్కడి నుంచే సేవలు అందిస్తున్నట్లు, మరోవైపు భారత్‌లో ప్రతిభ కలిగిన ఐటీ ఉద్యోగులు అధికంగా ఉన్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంస్థలో 2 వేల మంది సిబ్బంది ఉండగా, వీరిలో అత్యధిక మంది అమెరికాలోనే విధులు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. హైదరాబాద్ సెంటర్ కోసం మరో 400 మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ..తెలంగాణలో తమ పెట్టుబడులను రెండింతలు పెంచుకోవడానికి మెడ్‌ట్రానిక్ ముందుకురావడం సంతోషంగా ఉన్నదని, కంపెనీకి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. భారత్‌లో అడుగు పెట్టడంలో భాగంగా 2020లోనే హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించింది.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో ఆషాఢం సేల్స్

జూబ్లీహిల్స్, జూలై 10: తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాల్లో ఆషాఢ మాసానికి ఉన్న ప్రత్యేకత నేపథ్యంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షోరూమ్స్‌లో భారీ తగ్గింపు ధరలతో సరికొత్త ఆఫర్‌లను అందిస్తున్నది. ఇందులో భాగంగా కిలోల్లో షాపింగ్ చేసి టన్నుల్లో ఆనందం పొందండంటూ అన్ని రకాల వస్త్రాలపై 66 శాతం తగ్గింపు ధరలతో 'ఆషాఢం నంబర్-1 కిలో సేల్' ఆఫర్ అందుబాటులోకి తీసుకొచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ డెబిట్/క్రెడిట్ కార్డులపై ఈఎంఐ సదుపాయాన్ని కల్పించడంతో పాటు రూ.5 వేల వరకు తక్షణ డిస్కౌంట్ అందిస్తున్నది. వినియోగదారుల అభిరుచి మేరకు కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ, పోచంపల్లి.. డిజైనర్ శారీస్, హై ఫ్యాన్సీ శారీస్, క్యాటలాగ్ శారీస్, కిడ్స్ వేర్ వంటి వైవిధ్యభరితమైన వస్త్ర శ్రేణిని అందుబాటులో ఉంచారు. ఆషాఢం నంబర్-1 కిలో సేల్ ఆఫర్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు వస్త్ర ప్రియుల కోసం సరికొత్త స్టాక్‌ను తెలుగు రాష్ట్రాల్లో ఉన్న షోరూమ్‌లలో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆషాడ వేడుకల సందర్భంగా వస్త్రాభిమానుల నుంచి 'నభూతో..' అన్న రీతిలో అనూహ్య స్పందన లభిస్తుందని.. మహిళా లోకం పెద్ద ఎత్తున షోరూమ్‌లకు తరలిరావడమే నిదర్శనమన్నారు.

అపాచీ రేసింగ్ ఎడిషన్

ధర రూ.1.28 లక్షలు

చెన్నై, జూలై 10: టీవీఎస్ అపాచీ 2024 ఆర్‌టీఆర్ 160 రేసింగ్ ఎడిషన్‌గా మళ్లీ మార్కెట్లోకి విడుదల చేసింది. ఢిల్లీ షోరూంలో ఈ బైకు ధర రూ.1.28 లక్షలుగా నిర్ణయించింది. రేసింగ్ ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ బైకును నూతన ప్రమాణాలకు లోబడి తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా పనితీరు మెరుగుపరిచినట్లు, అడ్వాన్స్ ఫీచర్స్‌తో తయారు చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

అమ్ముడుపోని కార్ల విలువ 60,000 కోట్లు

డీలర్ల వద్ద ఆల్‌టైమ్ హైకి చేరిన వాహన నిల్వాలు

న్యూఢిల్లీ, జూలై 10: ప్యాసింజర్ వాహన కొనుగోళ్లు మందగించడంతో.. డీలర్ల వద్ద అమ్ముడుపోని కార్ల నిల్వలు మునుపెన్నడూ లేనివిధంగా పేరుకుపోయాయి. ఆల్‌టైమ్ హైకి చేరిన ఈ ఇన్వెంటరీల విలువ రూ.60,000 కోట్లుగా ఉన్నట్టు ఆటో పరిశ్రమ చెప్తున్నది. వర్షాభావం, తగ్గిన రుణ లభ్యత, ఆర్థిక మందగమన పరిస్థితులు వాహన విక్రయాలను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తున్నట్టు ఆటోమొబైల్ డీలర్ల సంఘం సమాఖ్య (ఫడా) ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మొదలు కార్ల అమ్మకాలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయంటున్న ఫడా.. సుమారు 6 నుంచి 6.5 లక్షల కార్లు ఊరికే అలా ఉండిపోయాయని, ఒక్కో కారు విలువ సగటున రూ.9.5 లక్షలుగా లెక్కించినా వీటి విలువ దాదాపు రూ.60,000 కోట్లుగా ఉంటుందని పేర్కొన్నది. గత రెండు నెలల్లో పెరిగిన స్టాక్ 77,000 యూనిట్లుగా ఉండటం గమనార్హం.

ఆఫర్లు.. డిస్కౌంట్లు

మార్కెట్‌లో అమ్మకాలు క్రమేణా క్షీణిస్తుండటాన్ని గమనించిన ఆటో రంగ సంస్థలు.. కస్టమర్లను ఆకట్టుకొనేందుకు రకరకాల ఆఫర్లు, డిస్కౌంట్లనూ తెరపైకి తెస్తున్నాయి. టాటా, మహీంద్రా, మారుతి ఇటీవల ప్రకటించిన ధరల తగ్గింపు, వివిధ మాడళ్లపై ప్రవేశపెట్టిన ప్రయోజనాలే ఇందుకు నిదర్శనం. నిజానికి ఈ ఏడాది ఏప్రిల్ నుంచే స్తబ్ధత నెలకొన్నది. దీంతో కొత్త మాడళ్లకు, ఎస్‌యూవీలకూ డిస్కౌంట్లనిస్తున్నాయి కంపెనీలు. అయినప్పటికీ జూన్‌లో సేల్స్ పడిపోయాయి. చేసిన సరఫరా ఆధారంగా కంపెనీల లెక్కలు గతంతో పోల్చితే 4 శాతం పెరిగి 3,41,000 యూనిట్లకు చేరాయని చెప్తున్నా.. జరిగిన వాహన రిజిస్ట్రేషన్లు 2,81,000 మాత్రమే. దీంతో ఆ మిగిలిన కార్లన్నీ డీలర్ల వద్దే ఉండిపోయాయి. మారుతీ సుజుకీ రిటైల్ సేల్స్ 8 శాతం పతనమయ్యాయి. దీంతో డిస్కౌంట్లు ఎక్కువగా ఇవ్వాలని, షోరూంలు త్వరగా తెరిచి.. ఆ